క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతని కాంగ్రెస్ పార్టీ జిల్లా గిరిజన యువ నాయకుడు బాపల్లి సంతోష్‌నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బాపల్లిలో తండాకు చెందిన శ్రీనునాయక్ అనారోగ్యానికి గురవ్వడంతో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.1.25 లక్షల చెక్కు అందజేశారు. పేద వర్గాలకు చెందిన గిరిజనులకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఆసరా నిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు మోత్యానాయక్, మహేందర్‌సింగ్, దాస్యా, గంగ్యా, హన్మంతు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల తరలింపు



మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చిన బతుకమ్మ చీరలు

పెద్దేముల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు గ్రామాల్లో మిగలడంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గురువారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చారు. రెండు రోజుల క్రితం ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్‌లు పంచాయతీ కార్యదర్శులకు గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు మిగలడంతో వాటిని మండల పరిషత్ కార్యాలయంకు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్, ఆటోల ద్వారా తీసుకొచ్చారు.

లగచెర్లలో పారిశుద్ధ్యంపై అవగాహన

దుద్యాల్: కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తమైంది. గురువారం మండల పరిధిలోని లగచెర్లలో వైద్య సిబ్బంది పర్యటించి వీధుల గుండా తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కొంత మంది ఇళ్ల ముందు కొన్ని రోజులుగా నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాములమ్మ, సూపర్‌వైజర్ నర్సమ్మ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 68వ జోనల్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ రాంరెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు అండర్‌-17 సీనియర్స్ కబడ్డీ విభాగంలో ద్వితీయ బహుమతి, అండర్‌-14 జూనియర్స్ ఖోఖో విభాగంలో ద్వితీయ బహుమతి అందుకున్నారని పీడీ సుధాకర్ తెలిపారు. పాఠశాల ఆవరణలో ఎంఈఓ రాంరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పీడీ సుధాకర్‌లు విద్యార్థినులను అభినందించారు.

రికార్డుల అప్‌డేట్ ముఖ్యం

పెద్దేముల్: గ్రామ పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని ఎంపీఓ రతన్‌సింగ్ సూచించారు. గురువారం మండలంలోని మన్‌సాన్‌పల్లి, రెగోండి, మదనంతపూర్‌తో పాటు పలు గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న వైకుంఠధామాలు, కంపోస్టుషెడ్, నర్సరీలతో పాటు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. కంపోస్టు షెడ్‌లో తడి, పొడి చెత్త ఉండాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పాడైతే చర్యలు తప్పవన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అహగాహన అవసరం

దౌల్తాబాద్: ప్రాణాంతకమైన ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఆర్‌జీ కేర్ సంస్థ ప్రోగ్రాం డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చల్లాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యాధి పట్ల అహగాహన ఉండాలని సూచించారు. హెచ్‌ఎం హన్మంత్‌గౌడ్, సంస్థ సభ్యులు అశోక్, నరసింహ ఉన్నారు.



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



కొడంగల్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

నిరంకుశత్వాన్ని ఎదిరించిన ధీశాలి

నాటి నిజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా అలుపెరగని పోరు చేసిన చాకలి ఐలమ్మ త్యాగాన్ని ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు, అధికారులు స్మరించుకున్నారు. నేటి యువతకు ఆమె పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. గురువారం జిల్లా వ్యాప్తంగా వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని పలు కూడళ్లలో ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట: సీఎం రేవంత్ సమక్షంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండల నేతలు



తాండూరు టౌన్: చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



యాలాల: మండల కేంద్రంలో ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



పరిగి: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు



తాండూరు టౌన్: సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



దుద్యాల్: రజక సంఘం ఆధ్వర్యంలో..



కొడంగల్ రూరల్: నివాళులర్పిస్తున్న అధికారులు, రజక సంఘం నాయకులు



పెద్దేముల్: గాజీపూర్‌లో..

పని భారాన్ని తగ్గించండి

పంచాయతీ కార్యదర్శుల నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్యదర్శులు

యాలాల: గ్రామ పంచాయతీల్లో విధుల భారంతో పాటు నిధుల లేమి, పని ఒత్తిడిని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాల కార్యదర్శులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. ఇటీవల నల్గొండ జిల్లాలో కలెక్టర్ ఎంపీడీఓతో సహా ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెన్షన్ చేశారు. ఈ విషయాన్ని కార్యదర్శులు తీవ్రంగా తప్పుబట్టారు. నిధుల లేమి, అరకొర సిబ్బంది గ్రామాల్లో విధులను నెట్టుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతి సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలను సొంత డబ్బులతో చేపట్టాల్సిన దుస్థితి ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు స్పందించకపోతే మూకుమ్మడిగా సెలవులు పెట్టి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తారకచారి, పావనిరెడ్డి, సుధాకర్, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వన నర్సరీని తొలగించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వన నర్సరీని తొలగించి తమకు అనువైన ఆటస్థలానికి అప్పగించాలని పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ఆటలకు, క్రీడలకు ఎంతో అనుకూలంగా ఉన్న క్రీడాస్థలాన్ని వననర్సరీకి అప్పగించడంతో కొంత ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయమై త్వరలో అధికారులతో చర్చించి వననర్సరీని తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారన్నారు.

ఆ టీచర్లను రిలీవ్ చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులతో వెంకటరత్నం

బంట్వారం: సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బంట్వారం మండలంలోని ఆయా పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ నిర్ణయాల ప్రకారం డైరెక్టర్, సెక్రటరీ ప్రాతినిధ్య నోటీసు ఇవ్వాలన్నారు. 26వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఫ్ ముందు వరుసలో ఉంటుందన్నారు. అశాస్త్రీయమైన జీఓ 25ను సవరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి రవీందర్, సంఘ నాయకులు ప్రకాష్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

కొడంగల్ రూరల్: కుక్కల జననాల నియంత్రణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రిలో కుక్కలకు సంతానం కలుగకుండా ఆపరేషన్ చేసే కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వీధి కుక్కలు ఎక్కువ కావడంతో నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. కుక్కల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల వివరాలను అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నోవా, డాక్టర్ అతిరాం, డాక్టర్ సుజాత్ అలీ, డాక్టర్ పరమేష్, డాక్టర్ బాల్షీ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసర్చ్ సెంటర్ (ఏఆర్‌సీఐ)కు తరలివెళ్లారు. గురువారం ఏఆర్‌సీఐలో పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ అనే లాబొరేటరీని సందర్శించారు. అందులో నానోమెటీరియల్‌లో లిథియం అయాన్ బ్యాటరీస్, సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సిరామిక్ మెటీరియల్, ప్యానల్‌లో సోలార్ ఎనర్జీ స్టోర్ చేసుకునే విధానంపై సంబంధిత సైంటిస్టులు విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించినట్లు డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిలు హరిప్రియ, కె.అన్నపూర్ణ, బి.నర్సిములు, సోమ్లానాయక్ తెలిపారు. విద్యార్థులకు రీసర్చ్‌పై అవగాహన కల్పించేందుకు, ఆసక్తిని పెంపొందించేందుకు ఫీల్డ్ ట్రిప్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.



హైదరాబాద్‌లోని రీసర్చ్ సెంటర్ ఎదుట విద్యార్థులు

పరిశుభ్రత తప్పనిసరి

తాండూరు రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని స్వచ్ఛ భారత్ మిషన్ కో ఆర్డినేటర్ లక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని గౌతపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయొద్దని గ్రామస్తులను సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ధారూరు: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024, మార్చి 31 వరకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 982 పనులు జరిగాయని ఎంపీడీఓ నర్సింహులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంవత్సరంలో మండలంలో రూ.77.22 కోట్ల విలువ గల ఉపాధి పనులు చేపట్టారని ఆయన వివరించారు. అన్ని గ్రామాలు, తండాల్లో పనులు జరిగాయా లేదా అని తెలుసుకునేందుకు శనివారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు వస్తాయన్నారు. పనుల్లో అవకతవకలు జరిగితే తనిఖీ బృందాల సభ్యులకు ఫిర్యాదు చేయవచ్చని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

అనంతగిరి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా కడియాల చంద్రశేఖర్‌ను ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాటం చేస్తుందన్నారు. సీపీఎస్ రద్దు అయ్యే వరకు జాక్టో ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులతో కలిసి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, నాయకులు ఇన్నారెడ్డి, జిల్లా, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు నేతల సన్మానం



బొంరాస్‌పేట: ఎంఈఓను సన్మానిస్తున్న సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది



దుద్యాల్: ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన విజయ రామారావును యూటీఎఫ్ నాయకులు గురువారం సన్మానించారు. యూటీఎఫ్ అధ్యక్షుడు మల్లేశం, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, మల్లేశం, ఉపాధ్యాయులు రాములు, సుధాకర్‌రావు, చందు, రవి, శ్రీనివాస్, రామకృష్ణ, అంజనాయక్, యాదగిరి, హర్ష బేగం, సాలిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పెద్దేముల్: మండల నూతన ఇన్‌చార్జి ఎంఈఓగా నర్సింగ్‌రావు ప్రభుత్వం నియమించింది. ఆయన పదవి బాధ్యతలు గురువారం చేపట్టారు. గతంలో పని చేసిన ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య తాండూరు మండలానికి వెళ్లారు. ప్రస్తుతం ఇందూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా నర్సింగ్‌రావు కొనసాగుతున్నారు.

ఎంఈఓకు అభినందనలు

బొంరాస్‌పేట: రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం హరిలాల్ ఎంఈఓగా నియమితులయ్యారు. దీంతో గురువారం యూటీఎఫ్ మండల నాయకులు, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, మల్లయ్య, సీఆర్‌పీలు సోమ్లా, శంకరయ్య, ఐఈడీ వేణుగోపాల్, ఎమ్మార్సీ సిబ్బంది గౌసొద్దీన్ తదితరులున్నారు.

మోమిన్‌పేటలో..


మోమిన్‌పేట: మండల విద్యాధికారిగా బి.మల్లేశం నియమితులయ్యారు. మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో మల్లేశం ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు.

దోమలో..

దోమ: మండల వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు నూతన ఎంఈఓ వెంకట్‌ను ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు. గురువారం టీయూటీఎఫ్ సంఘం నేతలు షఫీ, వసురాం, మల్లేశ్, రవికుమార్, రాములు, పాండురంగాచారి, మెగ్యా, రాములు, రవి, అనంతయ్య తదితరులు ఎంఈఓను శాలువతో సత్కరించారు.

రాజీయే రాజ మార్గం

- లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం
- రేపు జాతీయ లోక్ అదాలత్
- హైకోర్టుల్లో అప్పీలు లేకుండానే కేసుల పరిష్కారానికి కృషి
- కక్షిదారులతో రాజీ కుదుర్చుకునేందుకు మంచి అవకాశం



దోమ: కోర్టు పరిధిలో ఉన్న చిన్న చిన్న తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, బీమా తదితర కేసులను సత్వరమే పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో కక్షిదారుల ఆమోదంతో రాజీ కుదిర్చి ఇరువర్గాలకు న్యాయం జరిగేలా న్యాయస్థానాలు పరిష్కార మార్గాలు చూపుతాయి. లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా హైకోర్టుల్లో అప్పీలు చేసుకోవడానికి వీలులేని విధంగా పరిష్కారం దొరకడంతో వందలాది కేసులు పరిష్కారమవుతాయి. బాధితులు, కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, ఆర్థికంగా నష్టపోకుండా సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ మధ్యమార్గంగా ఉపయోగపడుతుంది. మోటారు వెహికల్ యాక్టులు, అబ్కారీ కేసులు, బ్యాంకు రుణాలు, కుటుంబ తగదాలు, చీటింగ్ కేసులు, యాక్సిడెంట్ కేసులతో పాటు తదితర కేసులు పరిష్కారం కానున్నాయి. ఈ నెల 28న పరిగి పట్టణంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎలాంటి ఫీజు లేదు


పెండింగ్‌లో ఉన్న కేసులు లేదా న్యాయస్థానంలో ప్రీ-లిటిగేషన్ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక లోక్ అదాలత్. ఈ చట్టం ప్రకారం లోక్ అదాలత్‌లు ఇచ్చే అవార్డు(నిర్ణయం) సివిల్ కోర్టు కేసుగా పరిగణించబడుతుంది. రాజీకి అవకాశం ఉన్న కేసులను మాత్రమే లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా పరిష్కరించుకోవచ్చు. ఆ సంస్థ ఇచ్చే తీర్పు అంతిమం. కేసులు పరిష్కారమైనప్పుడు అవార్డుకు వ్యతిరేకంగా ఏ న్యాయస్థానం ముందు అప్పీలు చేయడానికి అవకాశం ఉండదు. తీర్పుతో ఇరుపక్షాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడుతాయి. లోక్ అదాలత్ కేసులకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు.

మండలం	కేసులు
పరిగి	20
దోమ	16
కుల్కచర్ల	14
చెన్గోముల్	13

అసలు ఏమిటీ లోక్ అదాలత్?

కోర్టుల్లో కేసుల సంఖ్య పెరిగిపోతుండడంతో వాటి సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను తీసుకువచ్చారు. దీని ద్వారా ఇరువర్గాలు తక్షణ పరిష్కారం పొందవచ్చు. లోక్ అదాలత్ అనేది లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్, 1987 ప్రకారం చట్టబద్ధమైంది. ఇది దేశంలో ఉపయోగించే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానంగా రూపొందించబడింది.

అవగాహన కల్పించాం



కక్షిదారుల ఆమోదంతో రాజీ పడేందుకు అవకాశం ఉంటుంది. మండలంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఇరువర్గాలు రాజీ చేసుకోవాలని ఇప్పటికే సూచించాం. కేసులపై గ్రామాల్లో అవగాహన సైతం నిర్వహిస్తున్నాం. ఎవైనా సందేహాలుంటే 87126 70043ని సంప్రదించండి.

– ఆనంద్‌కుమార్, ఎస్‌ఐ, దోమ

రాజీ చేసుకోవాలి



చాలా మంది మోటారు వెహికల్ యాక్టులు, అబ్కారీ కేసులు, బ్యాంకు రుణాలు తదితర కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వారు ఈ నెల 28న పరిగి కోర్టులో జరిగే లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలి. గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నాం. వివరాలకు 87126 70040 నంబర్ సంప్రదించాలి.

– శ్రీనివాస్, సీఐ, పరిగి